# జగదేక సుందరుడి కథ

"ఇంతకూ పిల్ల నచ్చ లేదంటావు"

"ఛ. బొత్తిగా గోరిల్లాలా ఉందనుకోమ్మా."

"పోరా నువ్వు మరీ చెప్తావు" నవ్వుతూ మజ్జిగ గ్లాసందుకుని లోపలికి పోయింది పిన్ని.

ఎండలోపడి వచ్చారేమో, చిన్నాన్న ఆయాసపడుతూ కూర్చున్నారు. అసలే స్థూలకాయం. పైగా మే నెల.

అన్నయ్య బెట్టుచూసి నాకు చిఱు కోపం వచ్చింది. "గోరిల్లా అంటే ఎలా ఉంటుం దేమిట్రా" క్వెశ్చన్ మార్కు ముఖం పెట్టాను.

"అచ్చం ఆ పెళ్ళి కూతురిలాగే ఉంటుంది సుమీ." అన్నయ్య గడుసు తనానికి ముసిముసిగా నవ్వుకుంది పిన్ని.

★ ★ ★

బాపట్ల. ఎక్కడ చూసినా మెత్తటి ఇసుక. ఇంటిచుట్టూ కొబ్బరి చెట్లు. చల్లని గాలి. ఆరుబయట కుర్చీలు వేసుకు కూర్చున్నాము. గుంటూరు ఎండలలో వేగి మాడిపోయిన దేహాన్ని మరమ్మత్తు చేసుకుందువు రమ్మని అన్నయ్య వ్రాసిన ఉత్తరం అందిన మరుక్షణమే రెక్కలు గట్టుకు వాలాను.

వచ్చి నాలుగు రోజులైనా కాలేదు. ఇంతలోనే ఓ పది సంబంధాలైనా చూసినట్లు జ్ఞాపకం. ఎక్కే గడప. దిగే గడప. ప్రతి పిల్లకు ఏదో ఒక వంక. బాపట్ల చుట్టుపట్ల గ్రామాలన్నీ సర్వే చేసేశాడు అన్నయ్య.

"ఆ అమ్మాయి మరీ నలుపు. గేస్ లైటే ననుకో"

... "ఎవరూ ప్రొద్దున చూసి నమ్మాయా. ఏం పేరన్నారూ? ఆ. సుగంధం కదూ. ఒట్టి దుర్గంధమే సుమా. పళ్ళు సరిగా కడుగుకుంటుందో లేదో గాని." ఇదీ వరస.

"ఒరేయ్ అన్నయ్యా. నిన్న చూసొచ్చావే. పంతులు గారి అమ్మాయి. అందంగానే ఉంటుందట గదూ?"

"చ చ్ఛ చ్ఛ. డేమ్ ఇన్సల్ట్. అలాటి శాల్తీ ఈ శేఖర్ ఎం.ఏ. గాడి అర్ధాంగి యగుటయా. ఐనా మరీ అంత ఎరుపేమిటి? రెడ్ ఏప్"

ఇదీ అన్నయ్య ధోరణి. కళ్ళు చింతాకుల్లా ఉన్నాయనో, పళ్ళు తెల్లగా లేవనో, బుగ్గమీద ఎఱ్ఱటి పుట్టుమచ్చ ఉందనో ... ఏదో ఒక లోపం వెతుకుతూనే ఉంటాడు.

నాకో చిన్న ఐడియా వచ్చింది. రేపు అన్నయ్య వాళ్ళతో నేనూవెళ్తే?!

ఇంతలో — అన్నయ్యే అన్నాడు "పోనీ రేపు నువ్వుకూడా రారాదుటే

ద్వితీయ బహుమతి రూ. 25

బంగారు విజయ భాస్కర్
సెకండ్ బి. యస్సి. ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ, గుంటూరు.

లతా. ఆ సుందర ముఖారవిందమును కనులపండువుగ గాంచెదవు గాని" పిన్ని మురిపెంగా అన్నది. "ఔను లతా అన్నయ్యతో నువ్వూ వెళ్ళమ్మా". తన కొడుకు జగదేక సుందరుడని ఆమె నమ్మకం మరి. తల్లి, కొడుకుల ఏకాభిప్రాయాన్ని చిన్నాన్నెప్పుడు కాదనరు.

తెల్లవారింది. చక చక కాఫీలు ముగించుకుని బయలుదేరాము.

ఆ అమ్మాయి కొద్దిగా భయపడుతూ వచ్చి కూర్చుంది. యథాలాపంగా చూశాను. అరే పద్మ! క్షణంలో సగం సేపు పైకెత్తిన ఆ కళ్ళు నన్ను చూసి సంతోషంగా నవ్వాయి. పరిచయాలైన తరువాత కావలసిన తతంగం పూర్తయింది. నాకు తెలుసు పద్మ అన్నయ్యకు తప్పకుండా నచ్చుతుంది. అసలు కడిగిన ముత్యంలా తీర్చి దిద్దినట్లున్న ఆ పిల్ల ఎవరికి నచ్చదు గనుక.

ఇంటికి వచ్చాము. అన్నయ్య నెక్ టై ఊడదీస్తున్నాడు. "పద్మ నీకు నచ్చింది గదూ"

కుతూహలం అణచుకోలేక పోయాను.



"ఏం. మీ క్లాస్‌మేట్ అనా" అదో రకంగా అన్నాడు. "అన్నట్లు, బుద్ధుడు వాళ్ళన్న య్యనుకుంటాను" నవ్వుతూ అడిగాడు.

"అదేమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"అబ్బే మరేంలేదు. చెవులు మరీ భుజాలను ముద్దు పెట్టుకుంటుంటే..." ఫక్కుమన్న అన్నయ్యను చూస్తుంటే వళ్ళు మండిపోయింది. 'వీడికీ జన్మకిక పెళ్ళికాదు' అని నిర్ణయం చేసుకున్నాను.

సంబంధాలు చూసి చూసి పిన్నివాళ్ళకు గూడ విసుగెత్తింది. పోనీ యూనివర్శిటీలో ఎవరైనా ప్రేమించాడా అంటే అదీ లేదుట. అన్నీ గొంతెమ్మ కోరికలు. నాలో నేనే నణుగుకున్నాను. పిన్ని కళ్ళనీళ్ళు పెట్టుకోటం మొదలు పెట్టింది.

★ ★ ★

ఎదురింటి వెంకట్రామయ్యగారి రెండో అమ్మాయి పెళ్ళి. హడావుడిగా ఉంది. వాళ్ళ చిన్నబ్బాయి రఘుతో అన్నయ్య ఓ_తెగ తిరిగేస్తున్నాడు.

చిన్నాన్న హడావుడిగ వచ్చారు. "చూడు శాంతా. వెంకట్రామయ్య కూతురు పెళ్ళికి రాలేదూ అవధానిగారని, ఆయనకో కూతురుంది చూశావూ. ఆ అమ్మాయి మనవాడికి బాగా నచ్చిందట." సంతోషంతో ఆయనకు మాట రావటం లేదు.

"అన్ని విషయాలు మాట్లాడాను. అబ్బాయిని వాళ్ళు చూసుకున్నారు. ఇంటికి వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తా మన్నారు."

పిన్నికి ఏనుగెక్కినంత సంబరమయింది. వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. ఆ అమ్మాయి ఒక్కతే కూతురట. కోడలు బోలెడు కట్నంతో వస్తుందిలెమ్మని పిన్ని ఆశ.

ఇంట్లో అందరం ఉత్తరం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాము. రోజు రోజుకు ఆతృత ఎక్కువై పోతోంది.

"మొన్న నిన్ను చూశాను, నిన్న మనసు కలిపాను, నేటినుండి నిన్నే తలచి, వెర్రివాడనైనాను —" పాడేది రేడియోకాదు. సాక్షాత్తు మా అన్నయ్య, "అమ్మయ్య" నాకు తెలీకుండానే అన్నాను.

"పోస్ట్!" అందరం పరుగెత్తాం వరండాలోకి. కవరు చింపటంలో చేయి తడబడింది.

"—క్షమించాలి. అమ్మాయికి పిల్లవాడు నచ్చలేదట...."

★★★